

అన్నమయ్య సహస్ర గళార్చనకు తరలిరండి

- తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయప్రసాద్

ప్రజాశక్తి-చిన్నమండెం

రాయచోటిలోని దశరధరామిరెడ్డి కల్యాణ మండపంలో ఈ నెల 13న అన్నమయ్య సహస్ర గళార్చన నిర్వహించనున్నామని, జిల్లా వాసులందరూ తరలి రావాలని తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామనుజ చిన్నజియర్ స్వామీ కార్యక్రమానికి విచ్చేస్తారని తెలిపారు. సంగీత కళారత్న యర్రగొల్ల శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో సహస్ర గళాకర్చన నిర్వహిస్తామని ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొన్నాలని ఆయన కోరారు.

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడులు

- జిల్లాలో ఎనిమిది అగ్రిల్యాబ్స్ ఏర్పాటు
- రబీలో 3,77,030 ఎకరాల్లో పంటల సాగు
- 40 శాతం సబ్సిడీతో యాంత్రీకరణ పరికరాలు
- వ్యవసాయ శాఖ జిల్లా అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఎ.నాగేశ్వరరావు



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఆధునిక శాస్త్రీయ పద్ధతుల నిర్వహణతోనే మెరుగైన దిగుబడులు సాధ్యం. విత్తన నాణ్యత, ఎరువుల, పురుగు మందుల విని యోగించాల్సిన అవసరం ఉంది. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీల పరిధిలో ఆరింట్లో ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్స్‌లో విత్తన పరీక్షల అనంతరం సరఫరా చేయడానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటాం. అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ పరికరాల పంపిణీ చేయడంతోపాటు డ్రోన్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని వ్యవసాయశాఖ జిల్లా అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎ.నాగేశ్వరరావుతో ప్రజాశక్తి ముఖాముఖి..

రబీ లక్ష్యం వివరాలు తెలపండి?

2022-23 రబీలో 3,77,030 ఎకరాల్లో పంటలు సాగు చేయాలనేది జిల్లా వ్యవసాయశాఖ లక్ష్యం. ఈలెక్కన 55 శాతం వర కు పంటలు సాగు చేయడమైంది. మరో 45 శాతం పంటల సాగు దశలో ఉంది.

రబీలో ఎరువుల లభ్యత మాటేమిటి?

రబీ సాగు లక్ష్యానికి అనుగుణమైన మేరకు 8,000 టన్నుల ఎరువులు అవసరమని ప్రతిపాదనలు అందజేయడమైంది. జిల్లా వ్యవసాయ శాఖ పరిధిలో 3,600 టన్నులు సిద్ధంగా ఉంది. డిసెంబర్‌లో మరోసారి కోటా వచ్చే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ఎరువుల లభ్యత పుష్కలంగా ఉంది.

ఇ-క్రాప్ లక్ష్యాల గురించి తెలపండి?

ఇ-క్రాప్, ఇకెవైసి విభాగాల నమోదులో 100 శాతం లక్ష్యాన్ని అధిగమించాం. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో జిల్లా మొదటి స్థానంలో కొనసాగుతోంది.

మెకనైజేషన్ సబ్సిడీ సంగతేమిటి?

వ్యవసాయ యాంత్రీకరణకు 40 శాతం సబ్సిడీ ఇస్తున్నాం. ఆసక్తి, అవసరం కలిగిన రైతాంతానికి డ్రోన్ల వంటి వ్యవసాయ పరికరాల నిర్వహణకు శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. ఇప్పటికి ఒకరికి శిక్షణ ఇచ్చాం. మరొకరిని ఎంపిక చేశాం. జిల్లాలో రైతు సంఘాలను కూడా విశ్వాసంలో తీసుకుని ముందుకు సాగుతున్నాం.

'మాండూస్' ప్రభావాన్ని వివరించండి?

జిల్లాలో మాండూస్ తుఫాన్ ప్రభావం మోస్తరుగానే కనిపిస్తోంది. జిల్లాలోని 35 మండలాల్లోనూ ప్రభావముంది. మాండూస్‌లో నేలకొరిగిన పంటల వివరాలను సేకరించే ప్రయత్నంలో ఉన్నాం. మాండూస్ తుఫాన్ కారణంగా జిల్లాలో సాగు చేసిన 1.50 వేల ఎకరాలకు వరంగా మారిందనే చెప్పవచ్చు. మరో 15 రోజుల వరకు భూమిలో తేమ శాతం ఉంటున్న కారణంగా మంచి దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పవచ్చు.

ఇన్‌పుట్ సబ్సిడీ గురించి తెలపండి?

2021 ఖరీఫ్‌లో ప్రకృతి వైపరీత్యాల బారిన పడిన 4,000 మంది రైతుల ఆధార్, బ్యాంకు ఖాతాల్లో తేడాలు నమోదు కావడం వల్ల తాత్కాలికంగా పక్కనబెట్టిన సంగతి తెలిసిందే. ఇటీవల 3,099 సంబంధించి 5.23 కోట్ల మేర చెల్లింపులు చేయడం జరిగింది. మిగిలిన స్వల్ప మొత్తాన్ని అతి త్వరలో సైతం చెల్లింపులు చేస్తాం.

నకిలీల నివారణ చర్యలేమిటి?

రబీ ప్రారంభంలోనే నకిలీ విత్తన సరఫరాలపై సీరియస్‌గా దృష్టి సారించాం. వ్యవసాయశాఖ అధికారులు, విత్తన, ఫెర్టిలైజర్ డీలర్లతో సమావేశాలు నిర్వహించాం. క్వాలిటీ కంట్రోల్ చేయడానికి తనిఖీలు చేపడతాం. నకిలీ విత్తన పంపిణీదారుల ఆధారాలు లభిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

అగ్రిల్యాబ్స్ ఏర్పాటు గురించి వివరించండి?

ప్రతి అసెంబ్లీకి అగ్రిల్యాబ్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులోభాగంగా జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఆరింట్లో అగ్రిల్యాబ్స్ ఏర్పాటు చేయడమైంది. కడపతోపాటు మరొక నియోజక వర్గంలో సీజన్ ముగింపు నాటికి ఏర్పాటు చేస్తాం.

15,647 ఎకరాల్లో నేలకొరిగిన పంటలు




- కడపలో 15,374, అన్నమయ్యలో 272 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- వరి, పొద్దుతిరుగుడు, బుడ్డశనగపై అత్యధిక ప్రభావం
- 141 ఎకరాల్లో పండ్ల తోటలకు దెబ్బ




రాయచోటి : తడిసిన పంటను ఆరబెడుతున్న రైతులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాయచోటి

కడప, అన్నమయ్య జిల్లాలపై మాండూస్ తుఫాన్ గణనీయ ప్రభావాన్ని చూపించింది. కడప జిల్లాలోని 36 మండలాల్లోని 17 మండలాల్లో అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల్లోని ఏడు మండలాల్లో 15,647 ఎకరాల్లో పంటలు నేలకొరగాయి. కడప జిల్లాలో పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, బి.మఠం, కాశినాయన, బద్వేల్, గోపవరం, అట్లూరు, సిద్ధవటం, ప్రొద్దుటూరు, పెద్దముడియం, మైదుకూరు, చాపాడు, వి.ఎన్‌పల్లి, వల్లూరు మండలాల పరిధిలోని 89 గ్రామాల్లో సాగు చేసిన పంటలపై కన్నెర్ర చేసింది. సుమారు 30 రకాల పంటలపై ప్రభావం చూపించింది. అత్యధికంగా 1,416.7 ఎకరాల్లో వరి, 123.5 ఎకరాల్లో మొక్కజొన్న, 1264.6 ఎకరాల్లో జొన్న, 12,389.5 ఎకరాల్లో బుడ్డశనగ, 41.99 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 138.3 ఎకరాల్లో మినుము పంటలు దెబ్బతి న్నాయి. వరి పంట కోత దశలోనూ, బుడ్డ శనగ పూత దశలోనూ,జొన్న పూత, పిందె దశలో ఉండడంతో దిగు బడులపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. అన్న మయ్య జిల్లాలో మదనపల్లి, పీలేరు, రాజంపేట, లక్కిరెడ్డిపల్లి ప్రాంతాల్లోని మదనపల్లి, నిమ్మనపల్లి, కొరబాల కుంట, బి.కొత్తకోట, పెనగలూరు, రామాపురం మండలాల పరిధిలోని 29 గ్రామాల్లో సాగు చేసిన 60 మంది రైతులకు సంబంధించిన 272.5 ఎకరాల్లోని పంట లను దెబ్బతీసింది. 257 ఎకరాలు వరి పంట ఉండ డం గమనార్హం. నేలకొరిగిన పంటలను ఆయా జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు 33 శాతం మేరకు నష్టం వాటిల్లితేనే ఎన్యూమరేషన్ చేసిన అనంతరం పంట నష్టం వాటిల్లినట్లు అంచనా కట్టే అవకాశం ఉన్న సంగతి తెలిసిందే. ఏదే మైనా ఈనెల 13వ తేదీ వరకు తుపాన్ ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో ఏమేరకు పంటనష్టం జాబితా విస్తరిస్తుందో తెలియడం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే నేలకొరిగిన, దెబ్బతిన్న పంటల నష్ట నివారణకు పంట గట్లలో నిల్వ ఉన్న నీటిని వెలుపలికి పంపించడానికి సంబంధించి గట్లను తెగ్గొడం, నేల కొరిగిన పంటల రక్షణకు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని వ్యవ సాయ శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. కడప జిల్లాలో 141.5 ఎకరాల్లో పండ్లతోటలపై మాండూస్ ప్రభావం చూపించింది. అరటి, ఉల్లి, టమోటో పంటలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది.



నిమ్మనపల్లి : నేలకొరిగిన బీర పంట



రాయచోటి : చెట్టు కొమ్మ సాయంతో విద్యుత్ తీగలు సరిచేస్తున్న సిబ్బంది



రాజంపేట : ధ్వంసమైన అరటి పంట



రాయచోటి : పొలాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



నిమ్మనపల్లి : దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న రైతులు

జీతాలు చెల్లించకపోతే ట్రెజరీలను ముట్టడిస్తాం

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్లకు 11వ తేదీ దాటినా జీతాలు చెల్లించకపోవడం అన్యాయమనీ, ప్రభుత్వం స్పందించి వెంటనే జీతాలు చెల్లించకపోతే ట్రెజరీలను ముట్టడిస్తామని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు .ఆదివారం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి అధ్యక్షతన జిల్లాశాఖ 76వ వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి బాగుందని చెబుతున్న ప్రభుత్వం జీతాలు చెల్లింపులో చేస్తున్న జాప్యం చేస్తోందని, దీని బట్టి ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశ పూర్వకంగానే చేస్తున్నట్లు అర్థమవుతుందన్నారు. జీతాలు లేక ఉపాధ్యాయులు ఆర్థిక సమస్యలతో సతమతమవుతుంటే ప్రభుత్వం చోద్యం చూడడం దారుణమని వాపోయారు. ఈ జాప్యం అలానే కొనసాగితే ఉద్యమ సంఘాలతో కలిసి ఉద్యమ కార్యాచరణ చేపట్టక తప్పదన్నారు. దినసరి ఖర్చులతో పాటు ఇంటి అద్దెలు, నిత్యవసర సరుకులు, బ్యాంకు రుణాల కంతులు చెల్లించలేక సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా పెన్షనర్లు వైద్య ఖర్చులకు, మందుల కొనుగోలుకు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉండడం దారుణమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిరంతరం సంక్షేమ పథకాలకు బటన్ నొక్కి డబ్బులు జమ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వకపోవడం ఏంటన్నారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి ,దాదాపీర్, ఇలియాస్‌బాష, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, సురేష్ బాబు, సంగమేశ్వరరెడ్డి, సిపిఐ జిల్లాకార్యదర్శి గాలి చంద్ర, జిల్లా ప్రధాన, ఆర్థిక కార్యదర్శులు చెన్నకేశవరెడ్డి, మహబూబ్ బాషా, జిల్లా నాయకులు విజయభాస్కర్,భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి కత్తి నరసింహారెడ్డి

సబ్‌ప్లాన్ కాలపరిమితిని పెంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్

దళిత, గిరిజన ప్రజలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించేందుకు 10 సంవత్సరాల కాలపరిమితితో 2013లో తెచ్చిన ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం గడువు 2023 మార్చితో ముగియనుందని, ఈ చట్ట కాలపరిమితిని పెంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దళిత, గిరిజనులకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించి వారి సంక్షేమానికి ఖర్చు పెట్టాలని కోరుతూ ఉమ్మడి రాష్ట్రంలో పెద్దయెత్తున ఉద్యమం చేయడంతో అప్పటి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక చట్టం 2013ను తీసుకువచ్చిందని తెలిపారు. ఈ చట్టం కాల పరిమితి 10 సంవత్సరాలని నిర్ణయించారని పేర్కొన్నారు. 2015 వరకు ఈ చట్టానికి సంబంధించిన నియమ నిబంధనలు లేకపోవడం వల్ల చట్టం అమలుకు కొంత ఇబ్బంది అయ్యిందని తెలిపారు. ఈ చట్టానికి లోబడి జనాభా ప్రాతిపదికన నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తూ వచ్చాయని పేర్కొన్నారు. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రణాళికా సంఘాన్నే రద్దు చేయడంతో దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులకు, ప్రాంతాలకు అపారమైన నష్టం వాటిల్లిందన్నారు. ప్రణాళికా సంఘాన్ని పునరుద్దరించేందుకు మన రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు. 2017లో నీతి అయోగ్ నిబంధనల మేరకు ఎస్సీ కాంపొనెంట్ పేరుతో నిధులు కేటాయించడం ప్రారంభమైందని తెలిపారు. దళిత గిరిజనులకి సంక్షేమ పథకాలు, ఉపాధి, మౌలిక సదుపాయాల కల్పన కోసం నిధులను కేటాయించాలని పేర్కొన్నారు. రాష్ట్రాలు తమ వాటాలను సకాలంలో ఇవ్వకపోవడం వల్ల 2013 నుంచి ఇప్పటి వరకు కొన్ని పథకాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం జరుగుతోందని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీలకు రక్షణ అవసరం కోసం చట్టాలను మరింత పకడ్బందీగా అమలు చేయాలని పేర్కొన్నారు.

వ్య.కా.స రాష్ట్ర కమిటీకి ముగ్గురు ఎన్నిక

ప్రజాశక్తి - కడప అర్బన్

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఈనెల 8,9,10 తేదీల్లో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్రమహాసభల్లో జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులను రాష్ట్ర కమిటీ లోకి తీసుకున్నారు. వ్యవసాయకార్మికసంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్‌ను రాష్ట్ర కార్యదర్శిగా, జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్‌ను, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఉపాధ్యక్షులు డి.వెంకటేష్‌ను ఎన్నుకున్నారు.



రాష్ట్ర కమిటీకి ఎన్నికైన శివకుమార్, అన్వేష్, వెంకటేష్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఇఒ దేవరాజు

గురువే జీవిత మార్గదర్శకులు : డిఇఒ

కడప అర్బన్ : విద్యార్థి జీవితంలో గురువు క్రియాశీలకపాత్ర పోషించి మార్గదర్శకుడిగా ఉంటారని జిల్లా ద్యాశాఖాధికారి సి.దేవరాజు పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ 139వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం ఉదయం 8,9,10 తరగతుల విద్యార్థులకు 'వైఎస్ఆర్ కడప జిల్లా చరిత్ర, సంస్కృతి, సామాజిక అంశాలు' పై 'క్విజ్' పోటీని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిఇఒ మాట్లాడుతూ మనిషి జీవితంలో తల్లిదండ్రులు, గురువులు, స్నేహితులు ప్రధానపాత్ర పోషిస్తారని, విద్యార్థులు తల్లిదండ్రులను ఆదరించడం, గురువులను గౌరవించడం, మంచి స్నేహితులతో స్నేహం చేయడం వంటి మంచి లక్షణాలను అలవరచు కోవాలన్నారు. సభాధ్యక్షులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ క్విజ్ విద్యార్థుల్లో మేథోశక్తిని పెంపొందించడంతో పాటు జిల్లాకు సంబంధించిన అనేక అంశాలపై అవగాహన కల్పిస్తుందని అన్నారు. విశిష్ట అతిథి, యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు జి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు సినిమాలకు తిరగడం, సెల్ వినియోగించడం వంటి అవల క్షణాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్య నభ్యసించాలన్నారు. మరో విశిష్ట అతిథి, బాలవికాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ బి.గంగయ్య మాట్లా డుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ దిశగా కృషి చేస్తే విజయం సాధించగలరన్నారు. కార్యక్రమంలో బాలవికాస్, వివేకానంద విద్యానికేతన్, శాంతినికేతన్, విద్యా మందిర్, పీస్ ఇస్లామిక్, నాగార్జున మోడల్, నజ్మల్ అమీన్,రాజు పాఠశాలల విద్యార్థులు 60 మందికి పైగా పాల్గొన్నారు.

ఐఎన్‌టియుసి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాసులురెడ్డి

రాయచోటి: ఐఎన్‌టియుసి అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఆదివారం విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో జరిగిన సర్వజన మహాసభలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా యర్రపురెడ్డి శ్రీని వాసులురెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వజన మహాసభ సమా వేశానికి ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బొందుగల వెంకటేశ్వరరెడ్డి, ఎపిజిఇఎ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ హాజరయ్యారైనట్లు తెలిపారు. ఈ సభ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కారం చేయని పక్షంలో సంక్రాంతి పండుగ తర్వాత ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తీర్మానం చేసినట్లు తెలిపారు. ఆయన ఏక గ్రీవ ఎన్నిక పట్ల ముప్పాల సుధాకర్ రాజు, శ్రీనివాసులు నాయక్ హర్షం వ్యక్తం చేశారు.

అసంబద్ధాలను సవరించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - బద్వేలు

ఉపాధ్యాయ బదిలీలు-2022లో ఇచ్చిన జిఒ నంబర్ 187లో ఉన్న అసంబద్ధాలను సవరించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏ పద్ధతిలో సర్దుబాటు జరిగినా ఉపాధ్యాయులకు పాయింట్స్ కేటాయించాలని, 98 రోల్‌పై ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో కదిలిస్తున్న ఎస్‌జిటిలకు, అలాగే 98 రోల్ లోపు యుపి పాఠశాలలో కదిలిస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు ప్రత్యేక పాయింట్స్ కేటాయించాలని కోరారు. గత బదిలీల సందర్భంగా ఉపా ధ్యాయులకు ఉన్న సౌకర్యాలైన తలసేమియా, జువైనెల్ డయాబెటీస్, గుండెలో రంధ్రం ఉన్న వారికి ప్రిఫరెన్సీ కేటగిరీగా పరిగణించాలని తెలిపారు. గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు స్పెషల్ పాయింట్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. 92లోపు రోల్ ఉన్న ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, పిఇటిలకు స్పెషల్ పాయింట్స్ కేటాయించాలని పేర్కొన్నారు. సబ్జక్ట్ కన్వర్షన్ అయిన వారిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఏ ఖాళీలను బ్లాక్ చేయ వద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల వాస్తవిక సమస్యల గ్రీవెన్సీలను తప్పక పరిగణలోకి తీసుకోవాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ రూపొందించి బదిలీలు, ప్రమోషన్స్ వెంటనే నిర్వహించాలని కోరారు.

జీవోలో మార్పులు చేయాలి

కడప అర్బన్ : ఉపాధ్యాయ బదిలీలకు మార్గదర్శకాలు సూచిస్తూ పాఠశాలలు విద్యాశాఖ విడుదల చేసిన జీవో నెంబర్ 187లో కొన్ని మార్పులు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ అధ్యక్షులు పోగుల వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో ఒక కేడర్లో పనిచేస్తూ ప్రమోషన్ పొంది మరలా అదే పాఠశాలలో ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులకు స్టేషన్ సీనియారిటీగా గుర్తించాలన్నారు.

రైతు సంఘం జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

అఖిల భారత రైతు మహాసభలు జయప్రదం చేయాలని మండలంలోని కొలుములపల్లె పంచాయతీ కృష్ణాపురంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య రైతు సంఘం జెండా ఆవిష్కరించారు. అంతకు ముందు కడపలో రైతు మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈనెల 12 నుంచి 16 వరకు కేరళలో నిర్వహించే సభలను విజయఁతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ.గోపాలకృష్ణయ్య, బి.దస్తగిరిరెడ్డి, జిల్లా నాయకులు బచ్చల వెంకటసుబ్బయ్య, రామచంద్రారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వీడాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

తుపాన్ పట్ల జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం విడాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఆదివారంజిల్లా కార్యదర్శి జి.చంద్ర ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగానే గత ఏడాది అన్నమయ్య ప్రాజెక్టు కట్ట తెగిపోయి అపార ప్రాణ, ఆస్థి నష్టం వాటిల్లిందని చెప్పారు. ఇంతవరకు అన్నమయ్య డ్యాం తెగిపోవడానికి కారకులైన అధికారులపై చర్యలు లేకపోవడం సిగ్గుచేటన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటరమణ

పంట తడవకుండా చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-అట్లూరు

తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడవకుండా చర్యలు చేపట్టామని ఆర్‌డిఒ వెంకటరమణ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ముంపు గ్రామమైన చింతువాండ్లపల్లె, సమీపంలో ఉన్న ఆకుతోటపల్లెల్లో పర్యటించారు. విద్యుత్, తాగునీరు సమస్యలు రాకుండా సంబంధితాధికారులు చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. సంబధితాధికారులందరూ క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని సూచించారు. ఇప్పటి వరకు గ్రామాల్లో నష్టాలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. ఆయన వెంట తహశీల్దార్ శ్రీవాణి, ఎంపిడిఒ సుజాతమ్మ, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బిసిలను అణగదొక్కుతున్న ప్రభుత్వం

- టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్

ప్రజాశక్తి కడప అర్బన్

వైసిపి ప్రభుత్వం బిసిలను అణగ దొక్కుతోందని టిడిపి జిల్లా అధి కార ప్రతినిధి మన్సూర్ అక్బర్ విమర్శించారు. ఆదివారం టిడిపి బిసి కార్యా లయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కాపు మంత్రులు ప్రయోజనం లేనివారిగా కీర్తి గడించారని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించే బాధ్యత, హక్కు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బ్రాహ్మణ, కాపులకు ఉందన్నారు. ప్రశ్నించకుంటే అన్యాయమే జరుగుతుందని హెచ్చరించారు. అన్ని కులాలకు న్యాయం జరగాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు హయాం లోనే సాధ్యమన్నారు. జగన్ సర్కార్ బిసి, దళితులకు, మైనారిటీలకు సంక్షేమం, అభివృద్ధి లేకుండా పాలిస్తున్నారని తెలిపారు. కార్పొరేషన్ రుణాలు, ఆదరణ పథకం, విదేశీవిద్యా, పెళ్లి కానుక, నైపుణ్య శిక్షణ, స్టడీ సర్కిల్స్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ రద్దు చేశారన్నారు. నవారత్నాలు పేరు చెప్పి కాలక్షేపం చేస్తుందే తప్ప ఏ వర్గమూ అభివృద్ధి చెందడం లేదని వాపోయారు. వైసిపి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అన్ని కులాల కార్పొరేషన్‌కు నిధులు, మత్స్యకారులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల సాయం, ఆత్మ హత్య చేసుకున్న వారికి రూ.7 లక్షలు, నాయీబ్రాహ్మణులందరికి రూ.10 వేలు, గొర్రెలు, మేకలు చనిపోతే యాదవులకు రూ,6వేలు, పరిహారం, నామినేటెడ్ పదవుల్లో 70శాతం కోటా, సంచార జాతులకు ఉచిత ఇళ్లు, కుల వృత్తులవారికి సున్నా వడ్డీ కి రుణం అమలుకాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అన్యాయం జరిగిన చోట ప్రజలు ప్రశ్నించకుంటే మరింతగా అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు చలపతి, బిసి ప్రధాన కార్యదర్శి కుందేటి కృష్ణయ్య యాదవ్, మైనారిటీ నాయకులు షబ్బీర్ ఖాసీమ్ పీరా , నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మన్సూర్ అక్బర్

నేటి నుంచి పారిశుధ్య వారోత్సవాలు

- మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్



ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో సోమవారం నుంచి ఈనెల 17వ తేదీ వరకు పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. ఈ సందర్భంగా తడి చెత్త, పొడి చెత్త వేరు చేయడం, పరిసరాల పరిశుభ్రత, ఇంటింటి చెత్త సేకరణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. హోమ్ కంపోస్ట్, బారెల్ కంపోస్ట్ గురించి పట్టణ వాసులకు తెలియజేస్తామన్నారు. పట్టణ పారిశుధ్య విభాగం, శానిటేషన్ సెక్రటరీలు, స్వయం సహాయక సంఘ మహిళలు పాల్గొంటున్న ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు

మాండస్ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కడప పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో రెండు రోజుల నుంచి మాండస్ తుఫాన్ వల్ల రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ముఖ్యంగా వరి పంట సాగుచేసి వచ్చిన దశలో వర్షం రావడం ఇబ్బందికరమన్నారు. తుపాను ప్రభావంతో రైతులకు ఎకరాకు రూ.20వేల వరకు నష్టం వస్తుందన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి వారికి వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. మొక్కజొన్న, మినుము పంటలకు కూడా భారీగా నష్టం జరిగిందన్నారు.

అధికారులు మామిడి తోటలను పరిశీలించాలి

- జడ్‌పిటిసి శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

తుపాను ప్రభావంతో దెబ్బతిన్న మామిడి తోటలను ఉద్యానశాఖ అధికారులు పరిశీలించాలని జడ్‌పిటిసి శివప్రసాద్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఈదురు గాలులకు, వర్షానికి మామిడి పూత రాలిపోయిందన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో దాదాపు 3వేల ఎకరాల్లో రైతులు మామిడి తోటలను సాగు చేశారన్నారు. చెట్లకున్న పూత రాలిపోవడంతో రైతులు బాగా నష్టపోయారన్నారు. గతేడాది కూడా మామిడి రైతులకు ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదన్నారు. ఈ ఏడాదైనా మామిడి రైతులు ఆదాయం చూస్తారనుకుంటే తుపాను వారి ఆశలపై నీళ్లు చల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. వరి రైతులు కూడా నష్ట పోయినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు ఆయా పంటలను పరిశీలించి దెబ్బతిన్న వాటి వివరాలను ప్రభుత్వానికి అందజేయాలని ఆయన కోరారు.

వేతనాలు చెల్లించకపోవడం దారుణం

- ఎస్‌టియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఉపాధ్యాయులకు 11వ తేదీ వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడం దారుణమని ఎస్‌టియు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి రావాల్సిన కరువు భత్యం బకాయిలను ఏప్రిల్ నెలలోనే చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలుకాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండు సార్లు డిఎలు ప్రకటిస్తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఒక్కసారి కూడా ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. ప్రజా ప్రతినిధులకు జీతాలు మాత్రం తప్పకుండా వారి ఖాతాలో జమ చేస్తున్నారని, ఉద్యోగుల విషయంలో అలా జరగకపోవడం శోచనీయమన్నారు. ఉపాధ్యాయులందరూ వారికి వచ్చే జీతాల మీదే ఆధారపడి బతుకుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల ఇబ్బందులను గమనించి వెంటనే వారి ఖాతాలో వేతనాలను జమ చేయాలని ఆయన కోరారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై అభ్యంతరం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానికంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణం వల్ల ప్రజలు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అగ్రహారం మలుపు వద్ద ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వల్ల సమస్యలు ఎదురవుతుండడంతోపాటు కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఇరుగుపొరుగు మహిళలకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. ఆ మేరకు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ మద్యం దుకాణాన్ని పాత రైతు భరోసా కేంద్రం పరిసర ప్రాంతానికి మార్చారు. అక్కడ స్థానికంగా నివసిస్తున్న మహిళలు ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటు పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి కేవలం తమ ఆదాయమే తప్ప, మహిళల కష్టాలు, ఇబ్బందులు పట్టవా అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుకాణం వద్ద కేవలం మద్యం అమ్మకాలు మాత్రమే జరగాల్సి ఉంది. అయితే మందుబాబులు మాత్రం అక్కడే మద్యం సేవిస్తూ గొడవలకు దిగుతూ సమస్యలను సృష్టిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదనే ఆరోపణలున్నాయి. స్థానిక మహిళలు, విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు. లేదంటే ఆందోళన చేపట్టాల్సి వస్తుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మద్యం దుకాణాన్ని ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లా స్థాయి చెకుముకి పరీక్ష వాయిదా

ప్రజాశక్తి - రాయచోటి

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి పరీక్షను ఈనెల 18వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కరుణాకర్, ప్రకాష్ రెడ్డి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. తుపాను కారణంగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచన దృక్పథాన్ని పెంపొందించడానికి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - రాయచోటి

స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యధావిధిగా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్‌లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కోవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

తుపాను బాధితులకు సత్వర సాయం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

తుపాను బాధిత ప్రజలకు సత్వర సాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య, అనంతపురం, చిత్తూరు, తిరుపతి, తదితర జిల్లాల్లో మాండోస్ తుపాను ప్రభావంపై ఆయన అనంతపురం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తుపాను బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, పునరుద్ధరణ విషయం లో ఎలాంటి అలసత్వం లేకుండా చూడాలని, విద్యుత్ శాఖ నష్టాలను అంచనా వేసి పరిహారం అందించేలా చూడాలని అన్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించాలని, ఎక్కడా విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల అనంతరం అంటు వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అన్ని ప్రాంతాల్లో దృష్టి సారించాలని అన్నారు. కలెక్టర్ గిరీష మాట్లాడుతూ తుపాను కారణంగా అన్నమయ్య జిల్లాలో 30 మండలాల్లో 11 మండలాలు ప్రభావితం అయ్యాయని తెలిపారు. రామాపురం, రైల్వే కోడూరు మండలాలు ఎక్కువగా ప్రభావితమైనట్లు తెలిపారు. జిల్లాలో సాగునీటికి ఎలాంటి నష్టం లేదని, విద్యుత్ శాఖకు సంబంధించి 25 స్తంభాలు, కొన్ని ఎటిఆర్‌లు, డిటిఆర్‌లు దెబ్బతిన్నాయని అన్నారు. కోడూరు మండలంలో దాదాపు 100 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, 6 కచ్చా ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. జిల్లాలో దాదాపు 109 హెక్టార్లలో వరి దెబ్బతిందని, 187 హెక్టార్లలో ఉద్యాన పంట పాడైనదని తెలిపారు.

రోడ్డుకు కోత.. అవస్థల్లో కాలనీవాసులు

ప్రజాశక్తి - వేంపల్లె

అండర్ డ్రెయినేజీ ఏర్పాటు కోసం చేపట్టిన రోడ్డు కటింగ్‌తో ఆయా ప్రాంతాల కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు. అండర్ డ్రయినేజీ పనుల చేపట్టేందుకు కొద్ది రోజుల క్రితం వేంపల్లెలోని రాజీవ్ నగర్ కాలనీ, రామలింగయ్య కాలనీల్లో రోడ్లును మధ్యలో కట్ చేశారు. మట్టిని రోడ్లపైనే వదిలేశారు. ఈ పరిస్థితుల్లో కురుస్తున్న వర్షాలకు ఆ ప్రాంతాలు బురదగా తయారై, ప్రజలు నడవలేని పరిస్థితి నెలకొంది. రోడ్లుపై మట్టి ఉండడంతో వృద్ధులు, చిన్నపిల్లలు నడవాలంటే భయాందోళనకు గురవుతున్నారు. రోడ్డు పనులు నెమ్మదిగా జరుగుతుండడంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. వర్షపు నీరు కూడా నిల్వ ఉండడంతోపాటు బురదతో పాదచారులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. కాలనీలోని ప్రతి వీధి అస్తవ్యస్తంగా తయారైంది. అండర్ డ్రయినేజీ కోసం రోడ్డు మధ్యలో కటింగ్ చేయడంతో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. పిల్లలు ఆడుకుంటూ ఆ గుంతల్లో పడతారేమోనని స్థానికులు హడలిపోతున్నారు. రాత్రి సమయంలో పాదచారులు, మోటర్ వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.



రామలింగయ్య కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు

ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రం : తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని, శ్రీలంక దుస్థితిని మించిపోతున్నట్లు పిసిసి మీడియా చైర్మన్ ఎన్. తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక ఎమర్జెన్సీ దిశగా రాష్ట్రం ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెల ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వాలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. నేటికీ కొన్ని శాఖల ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేదని విమర్శించారు. విశ్రాంతి ఉద్యోగులకు సకాలంలో పింఛన్ ఇవ్వక పోవడంతోపాటు ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు సకాలంలో ఆ బెటిఫిట్ ఇవ్వలేదని తెలిపారు. డిఎలు అయిదు పెండింగ్ ఉన్నాయన్నారు. కాంట్రాక్టులకు, సరుకులు సరఫరా చేసే వారికి కూడా బిల్లులు పెండింగ్ ఉన్నట్లు చెప్పారు. పెండింగ్ బకాయిలు చెల్లించండి.. మా ప్రాణాలు కాపాడండని బిక్షాటన చేస్తున్నట్లు చెప్పారు. బిల్లులు మంజూరు కాకపోవడం వల్ల టెండర్లకు కాంట్రాక్టర్లు వెళ్లడంలేదన్నారు. పంచాయతీ నిధులు మళ్లించారన్నారు. ప్రభుత్వం వద్ద రోడ్డు, సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులకు నిధులు లేవన్నారు. రైతులకు ధాన్యం సేకరణ డబ్బులు కూడా సకాలంలో ఇవ్వలేదన్నారు. వసతి గృహాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా రైల్వే ప్రాజెక్టు పనులు నిలిచి పోయాయని తెలిపారు. ప్రతి రోజు రిజర్వు బ్యాంకు వద్ద ఓవర్ డ్రాఫ్ట్ కోసం, చే బదులు కోసం దేహి అంటూ చేతులు చాపుతున్నట్లు విమర్శించారు. మరో వైపు ప్రభుత్వ ఆస్తులను అమ్మకాలకు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు, బస్సు ఛార్జీలు, పెట్రోలు, డీజిల్, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగినట్లు చెప్పారు. రాష్ట్రం అప్పుల కుప్ప అయినట్లు తెలిపారు. శ్రీలంక అప్పు రూ.2.8 లక్షల కోట్లు కాగా, ఆంధ్రప్రదేశ్ అప్పు రూ.8 లక్షల కోట్లు అన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోతే ప్రజా తిరుగుబాటు కారణంగా శ్రీలంక అధ్యక్షుడు పారిపోయినట్లే సిఎం జగన్‌కు కూడా ఆ పరిస్థితి వస్తుందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 360 కింద ఆర్థిక ఎమర్జెన్సీని విధించాల్సిన పరిస్థితులు స్పష్టంగా గోచరిస్తున్నట్ల తులసిరెడ్డి పేర్కొన్నారు.

బురదమయం.. గ్రామీణ రోడ్లు



చాపాడు : వర్షానికి అన్నవరం వద్ద అధ్వానంగా తయారైన రోడ్డు

ప్రజాశక్తి - చాపాడు

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. తుపాను వల్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడ్డాయి. మైదుకూరు నియోజకవర్గ పరిధిలో అన్ని మండలాల్లో ప్రతి రోజు రెండు నుంచి మూడు సెంటీమీటర్ల వర్షపాతం నమోదవుతోంది. ఇప్పటికే వర్షానికి పంట పొలాలన్నీ నీటితో నిండి ఉన్నాయి. లోతట్టు ప్రాంతాలు, గ్రామీణ రహదారులు మాత్రం వర్షం నీటితో నిలుస్తూ బురదమయంగా మారుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, ఖాళీ స్థలంలో వర్షపు నీరు చేరి జలమయంగా మారుతున్నాయి. చియ్యపాడు, చిన్నగురువలూరు పశువైద్యశాల భవనాలు వర్షానికి ఉరుస్తున్నాయి. వాటి ఆవరణలు నీటితో నిండాయి. చాపాడు ఉర్దూ హైస్కూల్లో వర్షం నీరు అధికంగా వచ్చి చేరుతోంది. అధికారులు స్పందించి నీరు నిలువ కుండా ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వానికి సంబంధించిన ఆవరణలో లోతట్టు ప్రాంతాలను గుర్తించి, వర్షపు నీరు నిలువకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మట్టిని తొలగించి మొక్కల పెంపకాన్ని చేపట్టాలని సూచిస్తున్నారు.

మురుగునీరు తొలగించరూ..!

ఖాజీపేట : మండల పరిధిలోని పత్తూరు గ్రామం చిన్నపాటి వర్షానికే జలమయంగా మారుతోంది. గ్రామంలోని రహదారులన్నీ పూర్తిగా దెబ్బ తిన్నాయి. వీధుల్లోని దారులన్నీ ఎగుడుదిగుడుగా మారడంతో మురుగు నీటితో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నా, క్షేత్రస్థాయిలో గ్రామాల్లో మాత్రం సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామ అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి సారించకపోవడంతో సమస్యలతో జీవనం సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రజా సమస్యలపై అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల వల్ల మురుగునీరు పెద్ద ఎత్తున వీధుల్లో నిల్వ చేరి ఉండటం వల్ల వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. సరైన వసతులు కల్పించి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పత్తూరు సచివాలయం వద్ద పెద్ద ఎత్తున నిల్వ చేరి ఉన్న మురుగునీరు

శనగ పంటలో మెలకువలు పాటించాలి : ఎఒ

ప్రజాశక్తి - ముద్దనూరు

శనగ పంటలో మెలకులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి సూచించారు. ఆదివారం ఎఒ మాట్లాడుతూ పంటలు సాగు చేసేటప్పుడు రైతులు వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు తీసుకోవాలన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల శనగ పంట సాగు చేసిన పొలాల్లో భూమిలో తేమ శాతం ఎక్కువ కావడం వల్ల ఎర్రగా మారిపోయే అవకాశం ఉందన్నారు. దీని నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు తమ పొలాల్లో 15 గ్రాముల యూరియాను ఒక లీటర్ నీటిలో కలిపి మధ్యాహ్నం సమయంలో పిచికారీ చేసుకోవాలన్నారు. లేదా 13.0.45 మల్టీకె 10 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పంట పైన పిచికారి చేస్తే పంట ఎర్రగా మారిపోకుండా భూమిలో అధిక తేమ శాతం నుండి కాపాడుకోవచ్చున్నారు. ఎక్కువ మోతాదుల్లో పురుగు మందులు తెగుళ్ల మందులు వాడకూడదన్నారు. తేమ శాతం అధికమైతే వేరు కుళ్లు తెగులు సోకే ప్రమాదం ఉందన్నారు. దీని దీని నివారణకు 2 ఎంఎల్ హెక్సాకొనజోలు మందును ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఈ మందులు మధ్యాహ్న సమయం లేదా సాయంత్రం సమయంలో పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చున్నారు.

జనవరికైనా వంతెన అందుబాటులోకి వచ్చేనా..?

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు-ముద్దనూరు 67వ నెంబర్ నేషనల్ హైవేపై ఉన్న వంతెన 16వ పిల్లరు మైలవరం జలాశయం నుంచి నీరు పెన్నా నదికి విడుదల కావడంతో గతేడాది నవంబర్ 22న పడిపోయింది. దీంతో జమ్మలమడుగు నుంచి ముద్దనూరు వైపు ఉన్న16 గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడ్డారు. తాత్కాలికంగా అదే ఏడాది డిసెంబర్‌లో ఒక కోటి 20 లక్షల రూపాయలతో వేసిన అప్రోచ్ రోడ్డు కూడా ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో రెండు సార్లు కొట్టుకుపోయింది. మళ్లీ పైపులు వేసి అప్రోచ్ పనులు చేశారు. ఏదేమైనా అధికారులు ఒక పిల్లరు స్థానంలో రెండు పిల్లర్లను ఏడాదికి వేశారు. పిల్లర్లపై వేసేందుకు 9 దిమ్మెలు కూడా సిద్ధం చేశారు. పిల్లర్లపై దిమ్మెలను ఎత్తడానికి పిల్లర్ల వద్ద గ్రావెల్‌తో రోడ్డును వేశారు. అంతలోనే మాండౌస్ తుఫాను ప్రభావం మళ్ళీ మైలవరం నుంచి పెన్నానదికి 4 వేల క్యూసెక్కుల నీరు వదలడంతో వంతెన పనులు చేసే వారు అప్రమత్తంగా ఉన్నారు. ఒక వైపు అప్రోచ్ రోడ్డుపై గుంతలు పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బురద, గుంతలతో వారు ఇక్కట్లకు గురవుతున్నారు. ఏమాత్రం ఆద మరిచినా కిందపడే ప్రమాదం ఉంది. నేషనల్ హైవే అధికారులు మాత్రం అక్టోబర్‌లో 'ప్రజాశక్తి' దినపత్రిక కథనానికి స్పందిస్తూ రెండు నెలల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కానీ పనులు ఆలస్యం కావడంతో జనవరిలో నైనా అందు బాటు లోకి వంతెన వస్తుందా.. ఆయా గ్రామాల ప్రజల్లో చర్చనీయాంశమైంది. అధికారులు మాత్రం పిల్లర్లపై దిమ్మెలు వేసి కాంక్రీటు వేశాక మూడు వారాలు క్యూరింగ్ చేయాలని చెబుతున్నారు. ఆ ప్రకారం జనవరి చివరికి వంతెన పూర్తి అవుతుందని తెలుస్తోంది. ప్రజలు మాత్రం త్వరగా వంతెన పూర్తి చేసి అసౌకర్యం లేకుండా చూడాలని పాలకులను, అధికారులను కోరుతున్నారు.



సిద్ధం చేసిన పిల్లర్లు, దిమ్మెలు



అప్రోచ్ రోడ్డుపై వెళుతున్న వాహనాలు

జాతీయ స్థాయికి ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రాజెక్టు

ప్రజాశక్తి - చాపాడు

ఎపి రాష్ట్రస్థాయిలో 30వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్-2022 ఈనెల10, 11 తేదీల్లో తిరుపతి జిల్లా గూడూరులోని ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో స్టేట్ లెవెల్ కాంపిటేషన్ నిర్వహించారు. ఇందులో 26 జిల్లాల నుండి 182 ప్రాజెక్టు పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి 17 ప్రాజెక్టులు జాతీయస్థాయిలో పాల్గొనడానికి అర్హత సాధించాయి. ఇందులో చాపాడు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సిబిఐటి నుండి షేక్ ఆసిఫా, షేక్ ఆప్సా (9వ తరగతి విద్యార్థులు) తయారు చేసిన శాంక్టిటీ టు క్లారిటీ ప్రాజెక్టు ఎంపికైంది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా చేతుల మీదుగా ప్రశంసలు అందుకున్నారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనకు సూచనలు, మార్గదర్శకత్వం వహించిన గైడ్ ఉపాధ్యాయులు ప్రశాంత్ ఎంతో కృషి చేశారు. ఈ ప్రాజెక్టు జాతీయస్థాయికి ఎంపికైనందుకు జిల్లా విద్యాశాఖ అధికారి సి.దేవరాజు, జిల్లా సైన్స్ సమన్వయకర్త డి.వి.సుబ్బానాయుడు, అకడమిక్ కో -ఆర్డినేటర్ ఆర్.శ్రీనివాసులరెడ్డి గైడ్ ఉపాధ్యాయులను అభినందించారు.



మంత్రి రోజా చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకుంటున్న విద్యార్థులు



ట్యాంకర్‌తో నీటిని తోడేందుకు సిద్ధమవుతున్న మున్సిపల్ సిబ్బంది

రహదారిపై నీరు తొలగింపు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆదివారం 'ప్రజాశక్తి' దినపత్రికలో ప్రచురితమైన 'కుంటలను తలపిస్తున్న రహదారులు' అనే శీర్షికన వచ్చిన కథనానికి నగర పంచాయతీ అధికారులు స్పందించారు. ఆ మేరకు వారు ఆదివారం ట్రాక్టర్ ట్యాంకర్లతో రోడ్డుపై నిల్వ ఉన్న నీటిని తోడి తరలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ నిల్వ ఉన్న నీటిని తరలించడం హర్షించదగ్గ విషయమే. అయినా తాత్కాలికంగా సమస్యను పరిష్కరించడం కాదని, నూతన సిసి రోడ్లు వేయాలని వారు అధికారులను కోరారు.

క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యల పరి ష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని జడ్‌పిటిసి తమ్మిశెట్టి బాలయ్య తెలిపారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గడపగడపకు మన ప్రభుత్వం కార్య క్రమాన్ని చేపట్టిం దన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు కమిటీలను ఏర్పాటు చేయడం హర్షణీ యమన్నారు. ఆయన తన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి 50 ఇళ్లకు ఇద్దరు ప్రకారం 15 వేల గ్రామాల్లో 5.20 లక్షల మందిని పార్టీ తరపున గృహ సారథులుగా నియమించారన్నారు. వైసిపి పాలనలో గ్రామీణ ప్రాంతాల్లో 92శాతం కుటుంబాలు, పట్టణ ప్రాంతాల్లో 85 శాతం కుటుం బాలకు లబ్ధి చేకూరిందన్నారు. ప్రస్తుతం ఈ కమిటీల ద్వారా 100 శాతం కుటుంబాలకు మేలు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు అత్యంత భారీ మేజార్టీ సీట్లను వైఎస్ జగన్‌కు ఇస్తారని ఆయన తెలిపారు. వైసిపి నాయకులు సత్తార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్‌పిటిసి తమ్మిశెట్టి బాలయ్య

నేత్రదాత కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలో ఇటీవల మరణించిన వ్యక్తి నేత్రాలను దానం చేసిన ఆయా కుటుంబసభ్యులకు ఆదివారం ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ మధ్య కాలంలో చిన్నగంగిరెడ్డి, అన్నారెడ్డి ఈశ్వర్‌రెడ్డి మరణించారు. ఆ సందర్భంగా ఆయా కుటుంబ సభ్యులు వారి నేత్రాలను దానం చేశారు. ఇందుకుగానూ అమృత సేవాసమితి అధ్యక్షుడు రాజు ప్రశంస పత్రాలు అందించారు. అనంతరం రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు చూపు ఇచ్చే బృహత్తర కార్యక్రమాన్ని ప్రతి కుటుంబం నేత్రదానాన్ని ఒక సంప్రదాయంగా అలవరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి సభ్యులు రఫీ పాల్గొన్నారు.

నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణ పరిధిలోని రంగనాథ స్వామి గుడిలో ఆదివారం నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు రాజేష్‌స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజస్తంభ దాతలు చెల్లా లక్ష్మయ్య నాయుడు దంపతులు, చెల్లా రమణ దంపతులు వారి కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రంగనాథ స్వామి గుడి చైర్మన్ చింతకుంట సుధీకర్‌రెడ్డి, ఇఒ రమణ, పులివెందుల వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, అంకాలమ్మ గుడి చైర్మన్ బ్యాటరీల ప్రసాద్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

350 ఎకరాల్లో వరి పంట నష్టం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పలు గ్రామాల్లో 350 ఎకరాల్లో వరి పంట నేలవాలి నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయాధికారి మ్యాగీ పేర్కొన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఖాదర్‌పల్లె, చాపాడు, పల్లవోలు, కుచ్చుపాప, చిన్న గురువలూరు, పెద్ద గురువలూరు, ఎన్.ఓబాయిపల్లె, అల్లాడుపల్లె, అయ్యవారిపల్లె, రాజువారిపేట, వెదురూరు, మడూరు తదితర గ్రామాల్లో దాదాపు 140 హెక్టార్లలో వరి పంట దెబ్బతిందని, ఆయా గ్రామాల రైతుల నుంచి ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఇంకా అన్ని గ్రామాల నుంచి సమాచారం అందాల్సి ఉందని ఆమె పేర్కొన్నారు. తుపాను మరో రెండు రోజుల పాటు ఇలాగే ఉంటే వరి పంటతో పాటు ఇతర పంటలు దెబ్బతినే అవకాశం ఉంటుందని ఎఒ తెలిపారు. వర్షం తగ్గిన వెంటనే పంట పొలాల్లో నీటిని తొలగించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. నీరు బయటకు తీసిన తర్వాత అందుకు సంబంధించిన మందులను పిచికారి చేసి పంట నష్టం వాటిల్లకుండా కాపాడుకోవాలని రైతులకు ఆమె సూచించారు.



ఖాదర్‌పల్లె వద్ద నేలవాలిన వరి పంటను పరిశీలిస్తున్న విఎఒ





మంత్రి పెద్దిరెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గిరీష, అధికారులు

వ్య.కా.స రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పి.శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా పందికాళ్ల మణి ఎన్నికయ్యారు. ఈ నెల 8, 9, 10వ తేదీల్లో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభల్లో వీరిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న వ్యవసాయ కార్మిక కుటుంబాలకు భూమి పంచాలని పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన శ్రీనివాసులును పలువురు అభినందనలు తెలియజేశారు.

ఐఎన్‌టియుసి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

ఐఎన్‌టియుసి అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం ఆదివారం విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో జరిగిన సర్వజన మహాసభలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా యర్రపురెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వజన మహాసభ సమావేశానికి ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బొందుగల వెంకటేశ్వరరెడ్డి, ఎపిజిఇఎ రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్.సూర్యనారాయణ, తదితరులు ప్రముఖులు హాజరయ్యారైనట్లు తెలిపారు. ఈ సభ వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కారం చేయని పక్షంలో సంక్రాంతి పండుగ తర్వాత ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తీర్మానం చేసినట్లు తెలిపారు. ఆయన ఏకగ్రీవ ఎన్నిక పట్ల ముప్పాల సుధాకర్ రాజు, శ్రీనివాసులు నాయక్ హర్షం వ్యక్తం చేశారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - రాయచోటి

స్పందన అర్జీల స్వీకరణ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ గిరీష ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యధావిధిగా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

15,647 ఎకరాల్లో
నేలకొరిగిన పంటలు



- కడపలో 15,374, అన్నమయ్యలో 272 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- వరి, పొద్దుతిరుగుడు, బుడ్డశనగపై అత్యధిక ప్రభావం
- 141 ఎకరాల్లో పండ్ల తోటలకు దెబ్బ



రాయచోటి : తడిసిన పంటను ఆరబెడుతున్న రైతులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాయచోటి

కడప, అన్నమయ్య జిల్లాలపై మాండూస్ తుఫాన్ గణనీయ ప్రభావాన్ని చూపించింది. కడప జిల్లాలోని 36 మండలాల్లోని 17 మండలాల్లో



రాయచోటి : చెట్టు కొమ్మ సాయంతో విద్యుత్ తీగలు సరిచేస్తున్న సిబ్బంది

అన్నమయ్య జిల్లాలోని 30 మండలాల్లోని ఏడు మండలాల్లో 15,647 ఎకరాల్లో పంటలు నేలకొరగాయి. కడప జిల్లాలో పోరుమామిళ్ల, కలసపాడు, బి.కోడూరు, బి.మఠం, కాశినాయన, బద్వేల్, గోపవరం, అట్లూరు, సిద్ధవటం, ప్రొద్దుటూరు, పెద్దముడియం, మైదుకూరు, చాపాడు, వి.ఎన్‌పల్లి, వల్లూరు మండలాల పరిధిలోని 89 గ్రామాల్లో సాగు చేసిన పంటలపై కన్నెర్ర చేసింది. సుమారు 30 రకాల పంటలపై ప్రభావం చూపించింది. అత్యధికంగా 1,416.7 ఎకరాల్లో వరి, 123.5 ఎకరాల్లో మొక్కజొన్న, 1264.6 ఎకరాల్లో జొన్న, 12,389.5 ఎకరాల్లో బుడ్డశనగ, 41.99 ఎకరాల్లో పొద్దుతిరుగుడు, 138.3 ఎకరాల్లో మినుము పంటలు దెబ్బతి న్నాయి. వరి పంట కోత దశలోనూ, బుడ్డ శనగ పూత దశలోనూ,జొన్న పూత, పిందె దశలో ఉండడంతో దిగు బడులపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. అన్న మయ్య జిల్లాలో మదనపల్లి, పీలేరు, రాజంపేట, లక్కిరెడ్డిపల్లి ప్రాంతాల్లోని మదనపల్లి, నిమ్మనపల్లి, కొరబాల కుంట, బి.కొత్తకోట, పెనగలూరు, రామాపురం మండలాల పరిధిలోని 29




రాజంపేట : ధ్వంసమైన అరటి పంట

గ్రామాల్లో సాగు చేసిన 60 మంది రైతులకు సంబంధించిన 272.5 ఎకరాల్లోని పంట లను దెబ్బతీసింది. 257 ఎకరాలు వరి పంట ఉండ డం గమనార్హం. నేలకొరిగిన పంటలను ఆయా జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు 33 శాతం మేరకు నష్టం వాటిల్లితేనే ఎన్యూమరేషన్ చేసిన అనంతరం



నిమ్మనపల్లి : నేలకొరిగిన బీర పంట

పంట నష్టం వాటిల్లినట్లు అంచ`నా కట్టే అవకాశం ఉన్న సంగతి తెలిసిందే. ఏదే మైనా ఈనెల 13వ తేదీ వరకు తుపాన్ ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో ఏమేరకు పంటనష్టం జాబితా విస్తరిస్తుందో తెలియడం లేదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే నేలకొరిగిన, దెబ్బతిన్న పంటల నష్ట నివారణకు పంట గట్లలో నిల్వ ఉన్న నీటిని వెలుపలికి పంపించడానికి సంబంధించి గట్లను తెగ్గొడం, నేల కొరిగిన పంటల రక్షణకు ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని వ్యవ సాయ శాఖ ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. కడప జిల్లాలో 141.5 ఎకరాల్లో పండ్లతోటలపై మాండూస్ ప్రభావం చూపించింది. అరటి, ఉల్లి, టమోటో పంటలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది.



రాయచోటి : వరి పంటలో నిలిచిన వర్షపు నీరు



రాయచోటి : పొలాల్లో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



నిమ్మనపల్లి : దెబ్బతిన్న వరి పంటను చూపుతున్న రైతులు

బాధితులకు సత్వర సాయం

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

తుపాను బాధిత ప్రజలకు సత్వర సాయం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అన్నమయ్య, అనంతపురం, చిత్తూరు, తిరుపతి, తదితర జిల్లాల్లో మాండోస్ తుపాను ప్రభావంపై ఆయన అనంతపురం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తుపాను బాధిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, పునరుద్ధరణ విషయం లో ఎలాంటి అలసత్వం లేకుండా చూడాలని , వీలైనంత త్వరగా నష్టాలను అంచనా వేసి పరిహారం అందించేలా చూడాలని అన్నారు. దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు పునరుద్ధరించాలని, ఎక్కడా విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాల అనంతరం అంటు వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అన్ని ప్రాంతాల్లో దృష్టి సారించాలని అన్నారు. కలెక్టర్ గిరీష మాట్లాడుతూ తుపాను కారణంగా అన్నమయ్య జిల్లాలో 30 మండలాల్లో 11 మండలాలు ప్రభావితం అయ్యాయని తెలిపారు. రాజంపేట, రైల్వే కోడూరు మండలాలు ఎక్కువగా ప్రభావితమైనట్లు తెలిపారు. జిల్లాలో సాగునీటికి ఎలాంటి నష్టం లేదని, విద్యుత్ శాఖకు సంబంధించి 25 స్తంభాలు, కొన్ని ఎటిఆర్‌లు, డిటిఆర్‌లు దెబ్బతిన్నాయని అన్నారు. కోడూరు మండలంలో దాదాపు 100 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, 6 కచ్చా ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. జిల్లాలో దాదాపు 109 హెక్టార్లలో వరి దెబ్బతిందని, 187 హెక్టార్లలో ఉద్యాన పంట పాడైందని తెలిపారు. కోడూరు మండలంలో 2 పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయన్నారు. రోడ్ల శాశ్వత పునరుద్ధరణకు సుమారు రూ. 5 కోట్ల నిధులు అవసరమని కలెక్టర్ తెలపగా, ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని మంత్రి తెలిపారు. రేపటి నుంచి వ్యవసాయ, ఉద్యాన పంట నష్టాల లెక్కింపు పూర్తి స్థాయిలో చేపట్టి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా ఉద్యానవ శాఖ అధికారి రవిచంద్రబాబు, డిఎంహెచ్ఒ కొండయ్య ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్, ఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకపోతే ట్రెజరీలను ముట్టడిస్తాం

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్లకు 11వ తేదీ దాటినా జీతాలు చెల్లించకపోవడం అన్యాయమనీ, ప్రభుత్వం స్పందించి వెంటనే జీతాలు చెల్లించకపోతే ట్రెజరీలను ముట్టడిస్తామని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు కత్తి నరసింహారెడ్డి పేర్కొన్నారు .ఆదివారం నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పి.రమణారెడ్డి అధ్యక్షతన జిల్లాశాఖ 76వ వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ



మాట్లాడుతున్న ఎంఎల్‌సి కత్తి నరసింహారెడ్డి

ఆర్థిక పరిస్థితి బాగుందని చెబుతున్న ప్రభుత్వం జీతాలు చెల్లింపులో చేస్తున్న జాప్యం చేస్తోందని, దీని బట్టి ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశ పూర్వకంగానే చేస్తున్నట్లు అర్థమవుతుందన్నారు. జీతాలు లేక ఉపాధ్యాయులు ఆర్థిక సమస్యలతో సతమతమవుతుంటే ప్రభుత్వం చోద్యం చూడడం దారుణమని వాపోయారు. ఈ జాప్యం అలానే కొనసాగితే ఉద్యమ సంఘాలతో కలిసి ఉద్యమ కార్యాచరణ చేపట్టక తప్పదన్నారు. దినసరి ఖర్చులతో పాటు ఇంటి అద్దెలు, నిత్యవసర సరుకులు, బ్యాంకు రుణాల కంతులు చెల్లించలేక సతమతమవుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా పెన్షనర్లు వైద్య ఖర్చులకు, మందుల కొనుగోలుకు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉండడం దారుణమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిరంతరం సంక్షేమ పథకాలకు బటన్ నొక్కి డబ్బులు జమ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసే ఉద్యోగ, ఉపాధ్యా యులకు జీతాలు ఇవ్వకపోవడం ఏంటన్నారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి ,దాదాపీర్, ఇలియాస-బాష, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, సురేష్ బాబు, సంగమేశ్వరరెడ్డి, సిపిఐ జిల్లాకార్యదర్శి గాలి చంద్ర, జిల్లా ప్రధాన, ఆర్థిక కార్యదర్శులు చెన్నకేశవరెడ్డి, మహబూబ్ బాషా, జిల్లా నాయకులు విజయభాస్కర్,భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

అన్నమయ్య సహస్ర గళార్చనకు తరలిరండి

- తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయప్రసాద్

చిన్నమండెం: రాయచోటిలోని దశరథరామిరెడ్డి కల్యాణ మండలంలో ఈ నెల 13న అన్నమయ్య సహస్ర గళార్చన నిర్వహించనున్నామని, జిల్లా వాసులందరూ తరలి రావాలని తొగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామనూజ చిన్నజియర్ స్వామీ కార్యక్రమానికి విచ్చేస్తారని తెలిపారు. సంగీత కళారత్న యర్రగొల్ల శ్రీనివాస యాదవ్ ఆధ్వర్యంలో సహస్ర గళాకర్చన నిర్వహిస్తామని ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొన్నాలని ఆయన కోరారు.

తుపానుతో దెబ్బతిన్న పంటలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మాండూస్ తుపాను ప్రభావంతో మండల పరిధిలో రైతులు సాగు చేసిన పంటలు దెబ్బతిని తీవ్ర నాష్టాన్ని మిగిల్చింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా రైతులు సాగు చేసిన పంటలు నేలకొరిగి నీట మునిగి తీవ్రంగా దెబ్బతిని పంట నష్టం వాటిల్లింది. నిమ్మనపల్లి-వాల్మీకిపురం మార్గంలోని కొమ్మిరెడ్డిగారిపల్లి వద్ద బహుదా నదిపై ఉన్న కాజువే వరద దాటికి దెబ్బతిన్నాయి. కోత దశలో ఉన్న వరి 50 ఎకరాలు నీట మునిగింది. 38 ఎకరాలలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. టమోటా 25 ఎకరాలు, బీన్స్ 2, బంతిపూలు 3, అరటి 4, క్యాలీఫ్లవర్ 2, బీర 2 ఎకరాల్లో దెబ్బతిన్నాయి. వర్ష ప్రభావం మరింత పెరిగితే పంట నష్టం కూడా పెరిగే అవకాశం ఉంది. రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు గ్రామాలలో పర్యటిస్తూ తుపాను కారణంగా వాటిల్లిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు. దెబ్బతిన్న పంట నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎంత మేరకు పంట నష్టం వాటిల్లిందనే వివ రాలను ప్రభుత్వానికి నివేదిస్తామని తహశీల్దార్ సిఆర్.మంజుల, మండల వ్యవ సాయాధికారి చంద్రశేఖర్, ఉద్యానవన శాఖాధికారి ఈశ్వర ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.

నేలకొరిగిన అరటి తోటలు

రాజంపేట అర్బన్ : మాండూస్ తుపాను వల్ల మండలంలోని హస్తవరం, ఆకేపాడు గ్రామాల పరిధిలో దెబ్బతిన్న ఉద్యాన పంటలను ఆదివారం ఉద్యాన అధికారి జి.సురేష్ బాబు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక అంచనా ప్రకారం మండలంలోరి



రాజంపేట : అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి

హస్తవరం, పెద్ద కారంపల్లి పోలి, మిట్టమీదపల్లి, ఆకేపాడు కూచివారిపల్లి, వరదయ్యగారిపల్లి, మందపల్లి, పుల పత్తూరు రైతు భరోసా కేంద్రాల పరిధిలో సుమారు 78 హెక్టార్లలో అరటి పంటకు నష్టం జరిగిందన్నారు. పుల్లంపేట మండల పరిధిలో 34 హెక్టార్లలో అరటి పంటకు నష్టం జరిగిందన్నారు. పంటలు దెబ్బతిన్న రైతులు రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించవలసిందిగా తెలియజేశారు. అధిక వర్షాల వలన దెబ్బతిన్న ఉద్యాన పంటల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు సూచనలు సలహాలు అందజేశారు.

టమోటా రైతులకు తీవ్ర నష్టం

గుర్రంకొండ : మండలంలోని టామోటా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పొలంలోనే రాలిపోయాయి. మామిడి, వరి రైతులకు నష్టం వాటిల్లింది. మామిడి పూత దశలో వర్షం కురవడంతో రాలిపోయింది. మామిడిలో ఆశించే పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి పంట పూర్తిగా నేలకొరిగింది. పండ్లతోటలు కూడా దెబ్బతిన్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

వీధులూడుస్తున్నారు.. బతుకు బాగుకు ఏడుస్తున్నారు...

పారిశుధ్య కార్మికుల జీవనం దుర్భరం - తక్కువ వేతనాలతో ఇబ్బందులు - పట్టని అధికారులు, పాలకులు



మురుగు నీటి కాలువలను శుభ్రం చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -పీలేరు

వణుకు పుట్టిస్తున్న మంచును సైతం లెక్క చేయకుండా గ్రామ ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం పారిశుధ్య కార్మికులు సైనికుల్లా పనిచేస్తుంటారు. పట్టణంలోని ప్రతి వీధిని ఊడ్చుతుంటారు. మురుగునీటి కాలువలు శుభ్రం చేస్తుంటారు. వారు తమ ఉద్యోగాలకు భద్రత కల్పించి, బతుకు భరోసా అందించాలని, వేతనాలు పెంచి అర్ధాకలి బాధలు తీర్చాలంటూ పంచాయతీ కార్మికులు ఏడుస్తున్నా ప్రభుత్వ నుంచి స్పందన లేదు. ప్రజాప్రతినిధులూ స్పందించడం లేదు. ఏళ్ళు గడుస్తున్నా స్థానిక పాలకులు వేతనాలు పెంచడానికి తగిన నిధుల్లేవంటూ.. వారిని బలవంతంగా వీ(వి)ధుల్లోకి పంపుతున్నారు. గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్ అంటూ పేర్లు వేరైనా వాటిలో ప్రజారోగ్యం కోసం పరిశ్రమిస్తూంది పారిశుధ్య కార్మికులే. కీలక విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు, తమ కడుపులు మాడ్చుకుంటూ, అర్ధాకలితో అలమటిస్తున్నా.., అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నా.., పారిశుధ్య పనులను మాత్రం సక్రమంగా పూర్తి చేయాలి, లేదంటే స్థానిక పాలకుల నుంచి వారికి బెదరింపులు, ఒత్తిళ్ళు తప్పవు.

పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో సుమారు 50 వేలకు పైగా జనాభా ఉంది. పట్టణంలో వందకు పైగా పెద్దా, చిన్నా వీధులున్నాయి. వీటికంతటికీ తాగు నీటి సరఫరా అందించడానికి ఒక విభాగం, వీధి దీపాల నిర్వహణకు ఇంకో విభాగం, పారిశుధ్యానికి మరో కీలక విభాగంతో పాటు కార్యాలయ సిబ్బంది సహా మొత్తం 108 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో 71 మంది కాంట్రాక్ట్ కార్మికులు కాగా మిగిలిన వారు అవుట్ సోర్సింగ్ సిబ్బంది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు 'పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని, వారి విధులను క్రమబద్ధీకరించి నెలసరి కనీస వేతనం రూ.18 వేలు చెల్లిస్తాం' అని భరోసా ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక తమ గోడు పట్టించుకోవడంలేదని కార్మికులు వాపోతున్నారు. తమకు ఇస్తున్న అత్తెసరు వేతనాలు కూడా సకాలంలో చెల్లించడంలేదంటూ వారు తమ ఆవేదనను వ్యక్తం చేసుకుంటుంటారు. తెల్లవారుజామున మొదలయ్యే తమ దినసరి విధులు సాయంత్రం వరకు కూడా కొనసాగించాల్సిన పరిస్థితిని వారు నిత్యం ఎదుర్కొంటున్నారు. అయినా తమ కష్టానికి తగిన ఫలితం దక్కడంలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులకు అందించే నూనె, సోపులు, పాదరక్షలు, సమరూప దుస్తుల పంపిణీ సమస్యలు ఏదో ఓ పంచాయితీలో చోటు చేసుకుంటూనే ఉంది.

ఆరోగ్య రక్షణ కరువు

ప్రజలకు అంటు వ్యాధులు సోకకుండా అవిశ్రాంతంగా సేవలు అందిస్తున్న వారిలో పంచాయితీ పారిశుధ్య కార్మిక వ్యవస్థ ఒకటి. తమ ఆరోగ్యం గురించి వారు పట్టించుకోకుండా, ప్రజారోగ్యం కోసం పరిశ్రమిస్తున్న కార్మికుల ఆరోగ్య రక్షణలేదు. అందుకు తగిన చర్యలు తీసుకోవడంలో అధికారుల సహకారం కొరవడుతూందని కార్మికుల నుంచి విమర్శలు వెలువడుతుంటాయి. తాము ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన భరోసాలేని జీవనం సాగిస్తున్నామని వారు వాపోతున్నారు. తాము చేస్తున్న సేవలకు తగ్గ సామగ్రి సమకూర్చడంలో కొన్ని చోట్ల అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఇకనైనా వారి ఆరోగ్యం, ఆర్థికి సమస్యలను పరిష్కరించి, ఉద్యోగ భద్రత, వారి బతుకులకు భరోసా, ఇఎస్ఐ, పిఎఫ్ లాంటి సౌకర్యాలు సమకూర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



పంచాయతీల్లో రెండు దశాబ్దాలుగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. వారి పరిస్థితులు ధీనంగా మారుతున్నాయి. అనేక పోరాటాలతో కొంత మేర వేతనాలు పెంచుకోగలిగినా, అదికూడా నెలల తరబడి బకాయిలు పెడుతున్నారు. జిల్లాలో అనేక చోట్ల వెట్టి చాకిరీకి, కులం పేరుతో అవమానాలకు కార్మికులు గురవుతూనే ఉన్నారు. 142 జిఒను సవరించి, ఇప్పటి వరకు పనిచేసిన కార్మికులందరికీ అది వర్తించేలా జిఒను సరవరించి, అమలు చేయాలి. 132, 57 జిఒలను కూడా అమలు చేసి కార్మికులను ఆదుకోవాలి.

- దనాసి వెంకట్రామయ్య, రాష్ట్ర అధ్యక్షులు, గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సంఘం.

మా బతుకులకు భరోసా ఇవ్వండి



కంపు కొట్టే మురుగును సైతం లెక్క చేయకుండా, మా ఆరోగ్యాలను ఫణంగా పెట్టి మురుగునీటి కాలువల్లో దిగి పనిచేస్తున్నాం. ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకే తాము పాటు పడుతున్నాం. చాలీ చాలని వేతనాలతో బతుకులు సాగిస్తున్నాం. పంచాయతీ కార్మికుల బతుకుల్లో అభద్రతా భావం తొలగి, తమ బతుకులకు తగిన భరోసా అందివ్వాలి.

- రాధారాణి, రాష్ట్ర కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం.

అధినేతలు మారినా అధికారాల్లో మార్పేదీ?



రాష్ట్రంలో అధినేతలు మారుతున్నా మా తల రాతలు మార్చే అధికారాల్లో మార్పు రావడంలేదు. నేతలు మాకిస్తున్న ఏ ఒక్క హామీ నెరవేరడం లేదు. మా ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా, మా సంతానం అనాధలవుతున్నా, ఎన్నో ఏళ్లుగా గ్రామ పంచాయితీల్లో కాంట్రాక్టు కార్మికులుగానే మిగిలిపోతున్నాం, ప్రజలకు సేవలు అందిస్తున్నాం.

- ఎన్. చిట్టెమ్మ పీలేరు గ్రామ పంచాయతీ యూనియన్ మహిళా అధ్యక్షులు.

కార్మికుల కష్టాన్ని గుర్తించాలి



ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు కార్మికులు పడుతున్న కష్టాన్ని, ఆరోగ్య పరంగా వారు కోల్పోతున్న నష్టాన్ని గుర్తించి తగిన న్యాయం చేయాలి. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికుల సేవలను గుర్తించి వారికి ఉద్యోగభద్రత కల్పించాలి. పారిశుధ్య కార్మికులమైనా, తాము కూడా మనుషులమేనని సమాజం గుర్తించాలి.

- పి. నాగమ్మ, గ్రామ పంచాయతీ యూనియన్ కార్యదర్శి, పీలేరు.


పట్టణంలోని వారపు సంత

సంతలో కానరాని వసతులు

అవస్థలు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలో వారపు సంత నిర్వహించే ప్రాంతంలో కనీస వసతులు కల్పించకపోవడంతో ప్రజల అవస్థలు పడుతున్నారు. కూరగాయలు కొనుగోలు కోసం మండలంలోని పలు ప్రాంతాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో ఇక్కడి సంతకు వస్తుంటారు. ముఖ్యంగా మరుగుదొడ్లు లేకపోవడంతో వ్యాపారులు, సంతకువచ్చే ప్రజలు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారులు మాట్లాడుతూ నిర్వాహకులకు సంవత్సరానికి గుత్త రూపంలో ఐదు లక్షల వరకు ఆదాయం వస్తున్న కూడా మరుగుదొడ్లు నిర్మించకపోవడం బాధాకరమని అన్నారు. వర్షం పడితే తల దాచుకోవడానికి షెల్టర్లు కూడా నిర్మించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో ఒక్కసారి ప్రతిపాదించామని చెప్పారు కానీ ఇంతవరకు మరుగుదొడ్లు నిర్మించడానికి కార్యాచరణ దాల్చకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి మహిళలు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మరుగుదొడ్ల ఏర్పాటు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న మిట్స్ అధ్యాపకులు

మిట్స్ విద్యార్థులకు ఉత్తమ అవార్డులు

ప్రజాశక్తి-కురబలకోట

మిట్స్ కళాశాలకు చెందిన ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు రాష్ట్ర బెస్ట్ విద్యార్థి అవార్డులు పొందారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారు 2021 సంవ త్సరానికి గాను రాష్ట్రస్థాయి అవార్డుల ప్రధానోత్సవాన్ని శ్రీకాకుళం జిల్లా, టెక్కలి లోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని లోని ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు అకాడెమిక్స్, పరిశోధన రంగంలో కనపరిచిన ప్రతిభలను గుర్తించి ప్రతిఏటా వారికి అవార్డులను ప్రకటిస్తారని చెప్పారు. మార్తల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బంకసాయిరెడ్డిలు అవార్డులను పొందారని చెప్పారు. ఐఎస్ టిఇ జాతీయఅధ్యక్షుడు ప్రతాప్‌సింగ్ కాకాసాహెబ్ దేశాయ్, స్టేట్ కౌన్సిల్ అవ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్ర రెడ్డి, అనంతపురం జెఎన్ టియు విసి డాక్టర్.రంగజనార్ధన్ చేతుల మీదుగా అవార్డులను అందు కున్నట్లు చెప్పారు. అవార్డులు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తినాదెళ్ల, ప్రిన్సిపల్ సి.యువరాజ్, అధ్యా పకులు విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.


వృథాగా పోతున్న తాగునీరు

పట్టని సర్పంచ్, మండల అధికారులు

ప్రజాశక్తి- నిమ్మనపల్లి


కొళాయి లేక పోవడంతో రోడ్డుపై పారుతున్న తాగునీరు

మండలంలోని తవళం గ్రామంలో పలు సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నా పట్టిం చుకునేవారు లేరని వారు వాపోతున్నారు. మండల అధికారులు పేరుకే గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామని ప్రచారాన్ని చేసుకుం టున్నా రని, తవళం గ్రామంలో కనీస మౌలిక వసతులు తాగునీటి కొళాయిలు, మురికి కాలువలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నా ఇక్కడి సర్పంచు కె.రెడ్డప్ప, మండల అధికారులు ఎవరు సమస్యలు పరిష్కరించడానికి చొరవచూపడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. సర్పంచుకు, మండల అధికారులకు సమస్యలపై ఫిర్యాదు చేసినా ఇదిగో చేస్తాం, అదిగో చేస్తామంటూ తప్పించుకుని తిరుగుతున్నారని అన్నారు. ఇందుకు నిదర్శనంగా ఆదివారం తవళంలో త్రాగునీరు పైపులైనుకు కొళాయిలు లేక తాగునీరు రోడ్డుపై వృథాగా పోతున్న దృశ్యం కనిపించింది. తాగునీరు పైపులైన్ ద్వారా వదిలిన ప్రతిసారి ఇలాగే వృథాగా పోతోందని, నీరు పట్టు కోవడా నికి ఇబ్బంది పడుతున్నామని ప్రజలు తెలుపుతున్నారు. కనీసం ఇప్పటికైనా సర్పంచు, అధికారులు స్పందించి పైపులైనుకు తాగునీటి కొళాయిలను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.


వర్షానికి ఒరిగిన విద్యుత్ స్తంభం

ఒరిగిన విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు-సదుంమార్గంలో రోడ్డు పక్కనే ఒరిగిన విద్యుత్ స్తంభాలతో ప్రమాదం పొంచి ఉంది. మాండూస్ తుఫాను కారణంగా రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సదుం మార్గంలోని నాయనివారిపల్లి సమీపంలో నేల తడిసి మెత్తబడ్డంతో విద్యుత్ స్తంభాలు పట్టు తప్పి వరగడంతో ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై విద్యుత్ అధికారులను ఆదివారం వివరణ కోరగా యుద్ధప్రాతి పదికన సహాయక చర్యలు చేపట్టేందుకు సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు రాకపోకలు సాగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

15న తలనీలాల వేలం

ప్రజాశక్తి -తంబళ్లపల్లె

మండలంలోని మల్లయ్య కొండపై ఉన్న భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయానికి సంబంధించిన తలనీలాల సేకరణ, పూజా సామాగ్రి విక్రయాలు, వాహన పార్కింగ్, పాదరక్షలు భద్రపరుచుకొను హక్కులను పొందుటకు ఈనెల 15వ తేది గురువారం ఉదయం 11 గంటలకు మల్లయ్య కొండ కింద మద్ద భక్తుని భావి వద్ద బహిరంగవేలము నిర్వహిస్తున్నట్లు చైర్మన్ మల్ రెడ్డి, ఇఒ మునిరాజులు తెలిపారు. ఈ వేలం నందు పాల్గొనటకు ప్రతి పాటదారుడు డిపాజిట్ 10 వేల రూపాయలు చెల్లించాలని తెలిపారు. ప్రతి పాటదారుడు ఆధార్ కార్డు జిరాక్స్ కాపిని కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రం ఏర్పాటుకు సిద్ధం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లె గ్రామపంచాయతీలో వెంగమా రాజుగారి పల్లె అంగన్వాడీ కేంద్రం భవనం కేంద్రానికి భూమి పూజ చేయుటకు ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంఇఒ వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు సోమవారం భూమి పూజకు సిద్ధమైనట్లు తెలిపారు. శుక్రవారం తహశీల్దార్ మహబూ చాంద్ గ్రామ కంటాన్ని గుర్తించి ప్రభుత్వ అంగన్వాడీ భవనానికి స్థలం చూపించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి మండల అధికారులు, ఐసిడిసి అధికారులు, సూపర్వైజర్లు, సిడిపిఓ పాల్గొనాలని ఆయన అన్నారు. సదాశివరాజు అనే వ్యక్తి భూమి తన అనుభవంలో ఉందని కంచె వేయడానికి ప్రయత్నిస్తుండగా తహశీల్దార్ ఫోన్ ద్వారా ఎస్ఐ కు సమాచారం ఇచ్చారు. తమ సిబ్బంది ఆర్ఐ, విఆర్ఓ ,వీఆర్ఏలు ఇక్కడికి చేరుకొని వెంటనే అవి తొలగించి ఇది ప్రభుత్వ భూమిని ఇందులో హాలో మీకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ప్రభుత్వ బిల్డింగ్ కోసం కలెక్టర్ కూడా ఈ స్థలాన్ని అప్లోడ్ అయినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ వెంకటేశ్వర నాయక్ ఆర్ఐ, విఆర్ఒ సంజీవ, ఎఎస్ఐ బ్రహ్మం, సూపర్వైజర్ లలితమ్మ, అంగన్వాడీ టీచర్ బండి శ్రీదేవి, విఆర్ఎలు రామచంద్ర, చంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


భూమి పూజకు స్థలాన్ని జెసిబితో చదును చేస్తున్న అధికారులు


రహదారిపై నిలిచిన వర్షపు నీరు

చెరువును తలపిస్తున్న రహదారి

ప్రజాశక్తి -ములకలచెరువు

ములకలచెరువులోని చెన్నై-ముంబై జాతీయ రహదారి చెరువుల మారింది. శనివారం కురిసిన వర్షానికి వర్షపు నీరంతా రోడ్డుపై చేరింది. స్థానిక పాత బంగ్లా వద్ద జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి ఉండడంతో వర్షపు నీరు నిల్వ చేరింది. ఆ ప్రాంతం నీటి కొలనుగా మారి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పక్కన పాదచారులు నడుచుకుంటూ వెళ్లాలంటే వాహనాలు వెళ్లే సమయంలో బురదనీరు ఎగురుతుందేమోనని భయాందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలు పూర్తిచేయాలని కోరుతున్నారు. స్థానిక జెడ్‌పి హైస్కూల్ మైదానం నీటితో నిండింది.

ఉధృతంగా పెద్దేరు వాగు

ప్రజాశక్తి -ములకలచెరువు

మండలంలోని పెద్దేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి వరకు కురిసిన భారీ వర్షానికి పెద్దేరు ఏరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మొలకచెరువు నుంచి తంబలపల్లికి వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రాకపోకలు స్తంభించిపోయాయి. పెద్దపాలెం సమీపంలోని పెద్దేరు కూడా నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. మండలంలోని చెరువులు, కుంటలు, చెక్ డ్యామ్‌లు నిండిపోయాయి.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎంపిడిఒ

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మాండూస్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పెద్దతిప్పసముద్రం మండలంలోని చెరువులు పూర్తిస్థాయిలో నుండి మొరవలు పోయే అవకాశముందని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ గిరిధర్ రెడ్డి సూచించారు. ఆదివారం ఆయన కందుకూరు పెద్ద చెరువును అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు మొంవపోయే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాల న్నారు. అదేవిధంగా మండలంలోని చెరువులు,కుంటలు పూర్తి స్థాయిలో నిండిపోయాయని, పిల్లలు,పెద్దలు అటువైపు వెళ్ళరాదని అన్నారు. వర్షాల వల్ల ఏమైనా సమస్యలు ఎదురైతే ప్రజా ప్రతినిధులు,అధికారులకు సమా చారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మొహమ్మద్, జెడ్‌పిటిసి ఉంగరాల శివన్న, ఎంపిటిసిలు కార్యం చంద్రశేఖర్,ఉత్తన్న పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్టించాలి

మద్దిరేవుల ఎస్సీ కాలనీ వాసుల డిమాండ్

ప్రజాశక్తి -లక్కిరెడ్డిపల్లె

రాయచోటి పట్టణంలో తహశీల్దార్ కార్యాలయం సముదాయంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తొలగించిన స్థానంలో తక్షణం అంబేద్కర్ విగ్రహాన్ని స్థాపించాలని మద్దిరేవుల ఎస్‌సి వాసులు డిమాండ్ చేశారు. ఆదివారం కాలనీ వాసులందరూ ఐక్యమై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తక్షణ విగ్రహం ఏర్పాటు చేయని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బిసి సంఘం నాయకుడు తుమ్మల గంగయ్య, ప్రజలు వట్టికాళ్ళ బాలకృష్ణ, వట్టికాళ్ల రమణ, శంకరయ్య, మంద రంగయ్య, మంద శ్రీనివాసులు నాగార్జున, కత్తి ఆంజనేయులు, మంద సంజీవ, శివప్రసాద్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఎస్‌సి కాలనీ వాసులు

ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షులుగా నవీన్ కుమార్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్


సనిశెట్టి నవీన్ కుమార్

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజంపేట పట్టణ కేంద్రానికి చెందిన సనిశెట్టి నవీన్ కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం కర్నూలు పట్టణంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి ముఖ్య అతిథులుగా ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దక్షిణ విభాగా అధ్యక్షులుగా జక్కా సుబ్బరాజు, ప్రధాన కార్యదర్శిగా పడుచూరి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కోట్ర మహేశ్వర గుప్తా పాల్గొన్నారు. అనంతరం వీరి ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా సనిశెట్టి నవీన్ కుమార్‌ను ఎంపిక చేసి ప్రమాణ స్వీకారాన్ని చేయిం చారు. వీరితోపాటు ప్రధాన కార్యదర్శిగా పెండ్యాల విజయ్ కుమార్, కోశాధికారిగా పొన్నూరు నిరంజన్ బాబు నియమించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సనిశెట్టి నవీన్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఆర్యవైశ్య సంఘం బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఆర్యవైశ్యుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్లోబల్ చైర్మన్ టీ.జి.వెంకటేశ్వర్లు, గ్లోబల్ అధ్యక్షులు టంగుటూరి రామక్రిష్ణ, ప్రపంచ ఆర్యవైశ్య నాయ కులం దరూ పాల్గొన్నారు.

హిమాయతుల్లా కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-కలికిరి

గుండెపోటుతో మరణించిన లేపాక్షి హిమాయతుల్లా కుటుంబాన్ని ఎమ్మెల్యే చింతల రామచంద్ర రెడ్డి పరామర్శించారు. శనివారం ఉదయం కలికిరి మసీదు వీధికి చెందిన లేపాక్షి యసానుల్ల రెండవ కుమారుడు హిమాయతుల్లా (51) గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతల రామకృష్ణారెడ్డి ఆదివారం ఉదయం మృతుని ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని వారికి తెలిపారు. కార్యక్ర మంలో వైసిపి నాయకులు చింతల శివనంద రెడ్డి, సతీష్ రెడ్డి, డాక్టర్ లోకవర్ధన్, గుట్టపాలెం సర్పంచ్ వెంకటరెడ్డి, బావాజీ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఫర్వీన్‌తాజ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్ జన్మదిన వేడుకలు ఆదివారం పెద్దతిప్పసముద్రంలోని కింగ్ ఫంక్షన్ హాల్ నందు టిడిపి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యమానికి రాజం పేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, రాజంపేట పార్లమెంట్ బిసిసెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్, బిసిసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, మహిళా ప్రధాన కార్యదర్శి విజయమ్మ, దేరంగుల నారాయణ, మాజీ జెడ్‌పిటిసి శంకర్, సురేష్, మాజీ మండల ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు భాస్కర్ నాయుడు, నానబాల ప్రసాద్, లతీఫ్, భాస్కర్ నాయుడు, శ్యామల పాల్గొన్నారు.

తుపాను బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో మండూస్ తుపాను బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని, తడిసిన ధాన్యాయాన్ని కొనుగోలు చేయాలని టిడిపి నాయకులు గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారున్నారు. కోత కోసిన పంట వర్షాలకు తడిచి పాడైపోయిందిన్నారు. చిత్తూరు, తిరుపతి, కడప, అనంతపురం, నెల్లూరు, గుంటూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లో పంటలు పూర్తిగా పాడయ్యాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన పంటలను అంచనా వేసి పరిహారం వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే కళ్లాల్లో ఉన్న పంటను ప్రభుత్వం కొనుగోలు చేయడంలో అలసత్వం, నిర్లక్ష్యం వహించడం వల్ల వేలాది ఎకరాల్లో పంట నీట మునిగిందని రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు .రైతులు పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే ప్రభుత్వం రైతుల సంక్షేమంపై దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు.

జిల్లా స్థాయి చెకుముకి పరీక్ష వాయిదా

ప్రజాశక్తి - రాయచోటి

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి పరీక్షను ఈనెల 18వ తేదీకి వాయిదా చేస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు కరుణాకర్ , ప్రకాష్ రెడ్డి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. తుపాను కారణంగా జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచన దృక్పథాన్ని పెంపొందించడానికి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


విశ్రాంత ఉపాధ్యాయులతో పూర్వపు విద్యార్థులు

పూర్వపు విద్యార్థుల కలయిక మరుపురానిది

విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శేషగిరి

ప్రజాశక్తి-రామాపురం

పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మరుపురానిదని విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు శేషగిరి అన్నారు మండలంలోని నీలకంఠరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975-76 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వపు విద్యార్థులు, విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు ఆత్మీక సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల మరింత దినదిన ప్రవర్తమానమే మంచి పేరు ప్రఖ్యాతులు సాధించాలని అన్నారు విశ్రాంత ఉపాధ్యాయులు తెలుగు పండిట్లు శివశంకర్ వెంకటరమణ, సైన్సు గణితం బోధ ఉపాధ్యాయులు వెంకటస్వామి పూర్వపు విద్యార్థుల గురించి కొనియాడారు. అనంతరం సర్పంచ్ హయబ్ ఖాన్‌తోపాటు విశ్రాంత ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉపసర్పంచ్ మహబూబ్ బాషా, విశ్రాంత తహశీల్దార్ అబ్దుల్ ఖాదర్, బాలాంజనేయులు, సహదేవరెడ్డి, మల్లేశ్వరరావు, ముర్తుజా, సరస్వతి, ఉమామహేశ్వర పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - చాపాడు

మాండుస్ తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కడప పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో రెండు రోజుల నుంచి మాండుస్ తుఫాన్ వల్ల రైతులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ముఖ్యంగా వరి పంట నూర్పిడికి వచ్చిన దశలో వర్షం రావడం ఇబ్బందికరమన్నారు. తుపాను ప్రభావంతో రైతులకు ఎకరాకు రూ.20వేల వరకు నష్టం వస్తుందన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి వారికి వెంటనే పరిహారం చెల్లించాలన్నారు. మొక్కజొన్న, మినుము పంటలకు కూడా భారీగా నష్టం జరిగిందన్నారు.


ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిచే ఉత్తమ సేవ అవార్డును అందుకుంటున్న శివకోటి

శివకోటికి ఉత్తమ సేవ అవార్డు

ప్రజాశక్తి- నందలూరు

ఇటీవల జాతీయ స్థాయిలో భారతీయ దివ్యాంగుల క్రికెట్ జట్టు కు ఎంపికై ఇండియా వర్సెస్ బంగ్లాదేశ్ మ్యాచుల్లో మన దేశం తరపున ఆడిన శివకోటి అద్భుతమైన ఆట తీరును కనబరిచి భారతీయ దివ్యాంగుల జట్టు వన్డే సిరీస్ కైవసం చేసుకోవడంలో శివకోటి కీలకపాత్ర పోషించి అలాగే టి 20 లోను ఒక టెస్టు మ్యాచ్ లోనూ అద్భుతమైన ఆల్ రౌండర్ ప్రదర్శనను కనబరిచి అలాగే పలు నేషనల్ టోర్నమెంట్లలో మ్యాన్ ఆఫ్ ది సిరీస్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్లు ఇతర జట్లతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ఉత్తమ క్రీడా అవార్డు లభించింది. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవము పురస్కరించుకొని మానవ హక్కుల వేదిక ఆధ్వర్యములో చేపట్టిన కార్యక్రమములో శనివారము కడప వైఎస్ఆర్ ఆడిటోరియంలో కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి, అలాగే కడప మేయర్ సురేష్ బాబు చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డుని అందుకోవడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివకోటి ఆత్మవిశ్వాసంతో అంగవైకల్యాన్ని జయించి పలువురికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. విభిన్న ప్రతిభావంతులు ఆత్మస్థైర్యంలో ముందుకు సాగాలని సూచించారు.ప్రతిభకు అంగవైకల్యం చాటురాదని అన్నారు. ఈ ఉత్తమ సేవా అవార్డుకు ఎంపిక చేసినటువంటి హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులకు శివకోటి కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్


అరెస్టు అయిన నాటుసారా నిందితులతో పోలీసులు

ఇద్దరు నాటు సారా నిందితులు అరెస్టు

ప్రజాశక్తి- కలకడ

నాటుసారా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కదిరాయచెరువు పంచాయతీ బొంతలవారిపల్లి సమీపంలో నాటుసారాను విక్రయించడానికి తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈదాడిలో బొంతల వారపల్లికి చెందిన వెంకటరమణ కుమారుడు ఈశ్వరయ్య, రెడ్డప్ప కుమారుడు సుధాకర్‌లు కలసి 20లీటర్ల నాటుసారాను తరలిస్తున్నట్లు గుర్తించి, వారిని అదుపులోకి తీసుకొని వారి నుంచి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచినట్లు ఎస్ఐ తెలిపారు.


రోడ్డు ప్రమాదవంలో మృతి చెందిన యువకులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

సుండుపల్లి-ప్రజాశక్తి

తిరుపతి జిల్లా భాకరాపేట ఘాట్‌లో జరిగిన ప్రమాదంలో అన్నమయ్య జిల్లా సుండుపల్లి ఆనందనగర్‌కు చెందిన నితీష్(17), కంచి పాటివాండ్లపల్లెకు చెందిన చంద్రశేఖర్(18)దుర్మరణం చెందారు. ఆదివారం సుండుపల్లి నుంచితిరుపతికి బైక్‌పై వెళ్తుండగా భాకరాపేట ఘాట్‌లో కారును ఢీకొట్టింది. ఘటనలో నితీష్ చంద్రశేఖర్‌ల అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు.

రైల్వేకోడూరులో :


ప్రమాదంలో మృతి చెందిన సుబ్రహ్మణ్యం

పట్టణంలోని మామిడి కాయల మండి దగ్గర కడప-తిరుపతి హైవే రోడ్డుపై ద్విచ క్రవా హన దారున్ని కారు ఢీ కొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు వెంకటగిరి రాజుపాలెంకు చెందిన సుబ్రమణ్యం తన ద్విచక్ర వాహనంలో రైల్వే కోడూరులోని తన బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళుతుండగా హైవేరోడ్డుపై ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి కింద పడినట్లు తెలిపారు. కింద పడ్డ యువకుని పైనుండి కారు ఎక్కించుకొని వెళ్ళడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఎస్ఐ రామ్మోహన్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతి చెందిన యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

వాహనాలు ఢీ : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి- ములకలచెరువు

రోడ్డుప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయ పడ్డారు. ఈ సంఘటన ఆదివారం ములకలచెరువు మండలంలో జరిగింది. 108 సిబ్బంది, స్థానికుల కథనం మేరకు మండలంలోని మలిగివారిపల్లికి చెందిన రామచంద్ర (55) , అమ రావతి (45) కలసి ద్విచక్ర వాహనంలో వేపూరికోటకు బయలుదేరారు. స్కూటర్ మార్గ మధ్యంలోని మద్దినాయుని పల్లి క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవారం రామచంద్ర ప్రయాణిస్తున్న బైకును ఢీకొంది. ఈ ప్రమాదంలో రామచంద్ర, అమరావతితో పాటు ములకలచెరువుకు చెందిన కొండ్రెడ్డి (70) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు108 వాహనంలో మద నపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-కలకడ

పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని ముడియంవారిపల్లికి పడమటి వైపున ఉన్న బంతు గుట్ట సమీపంలో పేకాట ఆడుతున్నట్టు ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో పేకాటాడుతున్న శ్రీనాథ్ రెడ్డి ,జనార్ధన్ రెడ్డి, భాస్కర, దస్తగిరి ,బాబాసాహెబ్, వెంకటరమణ, మరియు రఘునాథనాయుడులను పట్టుకుని వారి వద్దనుండి రూ.7200 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.ఈ దాడులలో పోలీస్ సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రమేష్, శ్రీనివాసులు ,రామ్మోహన, మహబూబ్ బాషా, ఖలీల్, హెూంగార్డు రమేష్, తదితరులు పాల్గొన్నారు.